క్లుప్తంగా

గ్రావెల్ టిప్పర్లు పట్టివేత

మద్దిపాడు: మండలంలో గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం అర్ధరాత్రి సమయంలో విజిలెన్స్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి ఎటువంటి లైసెన్సులు లేకపోవడంతో రెండు వాహనాలను సీజ్ చేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించి వాహనాలకుక ఫైన్ విధించినట్లు సమాచారం.

మెడికల్ సీటు సాధించిన ఘడియపూడి వాసి


బొమ్మల అమృత

మద్దిపాడు: నీట్‌లో 560 మార్కులు సాధించిన ఘడియపూడి కాలనీ వాసి బొమ్మల అమృత మెడికల్ సీటు సాధించింది. మొదటి ప్రయత్నంలోనే ఆమె మెడిసిన్ సీటు సాధించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ విద్యార్థిని తండ్రి బొమ్మల రామాంజనేయులు ఘడియపూడి గ్రామ సర్పంచ్ కావడంతో పలువురు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ


విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు సమకూర్చడంతో పాటు నాణ్యమైన విద్య అందించి మార్కులు సాధించి టాపర్లగా నిలుస్తున్నారని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 1,452 మందికి పంపిణీ చేశారు. హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు, పత్రే వెంకట్రావు, శరత్‌బాబు, జిలాని, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలు

నాగులుప్పలపాడు: అమ్మనబ్రోలు, నిడమానూరు ఎస్సీ బాలుర ప్రభుత్వ వసతి గృహంతో పాటు పోతవరం గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహాల్లో ప్రవేశాలకు నూతనంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిడమానూరు వసతి గృహం సంక్షేమాధికారి ప్రభుదాసు తెలిపారు. వసతి గృహాల్లో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చేరే వారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహంలో చేరే విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడి నియామకం


పెంట్యాల వెంకట సుబ్బారావు (ఫైల్)

నాగులుప్పలపాడు: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా ముప్పాళ్ళ గ్రామానికి చెందిన పెంట్యాల వెంకట సుబ్బారావును నియమించారు. గతంలో బీజేపీ మండల శాఖలో కార్యదర్శిగా పనిచేసిన సుబ్బారావును మండల అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సుబ్బారావు తెలిపారు.

ఫలితాల్లో నారాయణ విజయభేరి

ఒంగోలు: ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్టులో తమ కాలేజీ విద్యార్థులు విజయభేరి మోగించారని స్థానిక నారాయణ విద్యాసంస్థల డీన్ ఎస్.పిచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో రావులపల్లి గౌతమ్ 848, బత్తుల రూపాషాలిని 1428, వినుకొండ రణదీప్ 2406, సీహెచ్ కావ్యశ్రీ 2497, ఐ.చేతన్ 3626, మారెడ్డి వెంకట జశ్వంత్ 3649, ఆలూరి లక్ష్మీనారాయణ 3738, జి.హేమ చౌదరి 3940 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. 5వేల లోపు 20, 10వేల లోపు 132 ర్యాంకులు సాధించారన్నారు. మెడికల్ విభాగంలో తమ విద్యార్థి టి.భార్గవ్ జాతీయ స్థాయిలో 9773 ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో పి.సిరి చందన 466, పి.తేజస్వి 465, బైపీసీ విభాగంలో ఎస్.కె ఆఫ్రిన్ 434 మార్కులు సాధించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కంభం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని పట్టణంలోని నాయక్ వీధి ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ సహేరాబేగం అన్నారు. కంభం పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రభుత్వం అందించే విద్యా పథకాలు వివరిస్తూ ఆవాస ప్రాంతాల్లో ఇంటింటి సర్వే ద్వారా అందరినీ ఆకట్టుకుంటున్నారు. పాఠశాల ప్రవేశాలకు ఆమె ప్రచారం చేశారు.

విద్యార్థుల భవిష్యత్‌కు జగనన్న బంగారు బాట


జగనన్న ఆణిముత్యాలకు బహుమతులు, ప్రశంసపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, టీచర్‌లు, తల్లిదండ్రులు

- జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేత

చీమకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువకుంటున్న విద్యార్థుల భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బంగారు బాటలు వేశారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. గురువారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గం స్థాయిలో జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు, మెమెంటోలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్ళను మించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద పిల్లలకు కనీస మౌలిక వసతులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. ఇంగ్లిష్ మీడియం, నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెనల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేందుకు సీఎం తీసుకున్న నిర్ణయాలను ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి తీసుకోలేదన్నారు. విద్యాశాఖకు కేటాయించిన నిధులు గతంలో ఏ ప్రభుత్వం కల్పించలేదన్నారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక చేసి వారి ప్రతిభకు గుర్తుగా నగదు బహుమతులను ఇవ్వడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు మండలాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు, మెమెంటోలు, ప్రశంసపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించి అభినందించారు. ఇంటర్‌లో చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ (సీఈసీ గ్రూప్)నకు చెందిన అచ్చుకట్ల మదర్ థెరీస్సాకు రూ.15 వేలు, బైపీసీ గ్రూపులో చిలకా ఏసురత్నంకు రూ.15 వేలు, ఎంపీసీ గ్రూప్‌లో చీమకుర్తి గురుకుల బాలికల కాలేజీకి చెందిన లింగంగుంట శృతికి రూ.15 వేలు, హెచ్ఈసీ గ్రూపులో చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన వల్లెపు రమేష్‌కు రూ.15 వేలు చొప్పున నగదు బహుమతులను అందించారు. పదో తరగతిలో సంతనూతలపాడు గురుకుల బాలుర పాఠశాలకు చెందిన బండారు కార్తీక్, జాగర్లమూడి అశోక్‌లకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలను అందించారు. అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలకు చెందిన పి.శ్రీలతకు మూడో బహుమతిగా రూ.5 వేలను అందించారు. డిప్యూటీ డీఈఓ అనితా రోజ్ రాణి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సర్పంచ్ దర్శి నాగమణి, నాలుగు మండలాల ఎంఈఓలు, పలు హైస్కూళ్ళకు చెందిన ప్రధానోపాధ్యాయులు, టీచర్‌లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి ఏర్పాట్లు


నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు)

ఒంగోలు: స్థానిక రిమ్స్ ఆవరణలో ఏర్పాటుచేసిన మెప్మా పట్టణ నిరాశ్రయుల భవనం వద్ద ఒంగోలు రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు అన్నదానాన్ని ప్రారంభించారు. గురువారం నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ అనాథలుగా జీవితాన్ని సాగిస్తున్నవారికి ఆత్మస్థైర్యాన్ని కల్పించి వారిని సామాన్య మానవుల్లా మార్చాల్సిన అవసరం సమాజంపైనే ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ , ఆకలికి మాడటం సరికాదని భావించి మెప్మా ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని కల్పించి వసతిని కల్పించారన్నారు. ఈ భవనాన్ని స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి త్వరలోనే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తామని, సాయంత్రం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అల్పాహారం అందిస్తామన్నారు. పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా బెడ్లు ఏర్పాటుచేయడం జరిగిందని, ఒక్కో హాల్లో 16 చొప్పున ఉన్నాయని, టాయిలెట్లు, స్నానపు గదులు కూడా ఉన్నాయని చెప్పారు. ఒక మనిషి ఇందులో ఏడురోజులపాటు ఆశ్రయం పొందవచ్చన్నారు. రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు సీవీ రెడ్డి, శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలు సిస్టర్స్‌కు అభినందనలు


కొప్పోలు సిస్టర్స్‌ను అభినందిస్తున్న జిల్లా జైలు సూపరెంటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జాతీయ మినీ అండర్-9 ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఒంగోలుకు చెందిన కొప్పోలు సిస్టర్స్‌ను జిల్లా కారాగారావాసం పర్యవేక్షణాధికారి పి.వరుణారెడ్డి అభినందించారు. ఒంగోలు జిల్లా జైలులో వార్డరుగా విధులు నిర్వహిస్తున్న కొప్పోలు నాగరాజు కుమార్తెలు అయిన కొప్పోలు అభిలాష, కొప్పోలు గీతాంజలి ఆర్చరీ పోటీల్లో పాల్గొనగా.. అభిలాష రజత పతకాన్ని సాధించింది. గీతాంజలి ఉత్తమ విలు ప్రదర్శన కనబరిచి బహుమతి అందుకుంది. గురువారం జిల్లా జైలులోని సూపరెంటెండెంట్ కార్యాలయంలో చిన్నారులను అభినందించిన పర్యవేక్షణాధికారి వరుణారెడ్డి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి కన్నవారికి, జన్మభూమికి పేరుప్రతిష్టలు తీసుకొనిరావాలని ఆకాంక్షించారు. జైలు సిబ్బంది కూడా చిన్నారులను అభినందించారు.

ఎయిడెడ్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి


డీఈవోతో మాట్లాడుతున్న ఏపీటీజీ నాయకులు

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీజీ జిల్లా అధ్యక్షులు కోడూరి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.ప్రభాకరరెడ్డిలు డీఈవో పి.రమేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 60 సంవత్సరాలకు పైబడిన ఉపాధ్యాయుల గ్యాప్ పీరియడ్‌కు సంబంధించి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పీఎఫ్, గ్రూప్ ఇన్స్యూరెన్స్‌కు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీచేయాల్సిన అవసరాన్ని గురించి చర్చించారు. ఆస్తులతో సహా ప్రభుత్వానికి ఇచ్చిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 010 హెడ్ కిందకు మార్చాలని, ఆర్‌సీఎం సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వంలో విలీనమైన బ్రాహ్మణ నిడమానూరు పాఠశాలకు రెండో టీచర్‌ను కేటాయించాలని, విద్యార్థులు లేని గుర్తింపులేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

మూడు బుట్టల ద్వారా చెత్త అందించాలి


25వ డివిజన్‌లో పరిశీలిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రజలు పారిశుద్ధ్య కార్మికులకు, క్లాప్ ఆటోలకు మూడు బుట్టల ద్వారా చెత్తను అందించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణతో కలిసి 25వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ప్రతి ఇంటికి మూడు రంగుల బుట్టలను అందజేశామని వివరించారు. తడి, పొడి, హానికార చెత్తలుగా విభజించి ఇవ్వటం వలన కలిగే ప్రయోజనాల గురించి కమిషనర్ స్థానికులకు వివరించారు.

ఆరోగ్యం చాలా ముఖ్యం


పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో

ఒంగోలు రూరల్: ఆరోగ్యం కొనలేనిదని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. కరవది పీహెచ్‌సీని గురువారం సందర్శించారు. ఏఎన్ఎంలు యాప్‌ల ద్వారా నిర్వహిస్తున్న సేవలు పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లోని ఎయిడెడ్ సీఈ స్కూలు బ్రాంచ్-2 ను ఆకస్మికంగా సందర్శించారు. ఐరన్ మాత్రల పంపిణీ పూర్తయినట్లు హెచ్‌ఎం టి.అంజిరెడ్డి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి, ఎయిడెడ్ స్కూలు కరస్పాండెంట్, హెచ్‌ఎం అంజిరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, జోస్నహారియట్, అంగన్‌వాడీ కార్యకర్త మేరీస్టెల్లా పాల్గొన్నారు.

ఒంగోలు చేరిన తిరుమల పాదయాత్ర


కాలినడకన తిరుమల బయలుదేరిన రమణరాజు,గోవింద స్వామి

ఒంగోలు టౌన్: ప్రసిద్ధ భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు, గోవింద స్వామి కాలినడకన కాకినాడ నుంచి మే 31న తిరుమలకు బయలుదేరిన పాదయాత్ర 16వ రోజు గురువారం సాయంత్రం ఒంగోలుకు చేరుకుంది. 2008వ సంవత్సరంలో భోగి మంటల్లో నిలిపిన నిలువెత్తు భారీ రావిమాను దుంగ నుంచి విఘ్నేశ్వర స్వరూపం పాదాల చెంత మూషికంతో స్వయంభుగా వెలిసిందని తెలిపారు. ఆ విగ్రహానికి కవచ ధారణ యజ్ఞం చేపడుతున్న కారణంగా కలియుగ స్వయంభు వెంకటేశ్వర స్వామి కొండకు కాలినడకన వెళ్లి కాలినడకన తిరిగి వచ్చి యజ్ఞ నిర్వాహణ చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. యాత్ర అనంతరం మహాన్నాభిషేకం ,కోలసంబరం, నవ రాత్రులతో జరిపే నిత్యాన్నదానంతో తిరుమల పాదయాత్ర ముగుస్తుందని వెల్లడించారు.

విత్తన దుకాణాలపై అధికారుల దాడులు

త్రిపురాంతకం: విత్తన దుకాణాలపై వ్యవసాయశాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విధిగా రసీదు పొందాలని మార్కాపురం ఏడీఏ రమాదేవి తెలిపారు. త్రిపురాంతకంలోని విత్తనాల దుకాణాల్లో అమ్మకాలు సాగిస్తున్న పత్తి, మిర్చి తదితర విత్తనాల ప్యాకెట్లపై లేబుల్ పరిశీలించి ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విధిగా రసీదు పొంది ఉంటే వారికి నష్టం జరిగినప్పుడు ప్రభుత్వ అధికారులకు లిఖిత పూర్వకంగా ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విత్తన కొనుగోళ్లలో నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈమె వెంట ఏఓ కె.నీరజ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

ఒంగోలు రూరల్: గ్రామాల అభివృద్ధి పనులపై పూర్తిగా దృష్టి సారించాలని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని 18 గ్రామాల కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందినప్పుడే పురోగతి ఉంటుందని ఆర్థిక పురోగతి సాధించాలన్న గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్నా కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. గతంలో మండల కేంద్రంలో ఆయా శాఖల కార్యాలయాలు ఉండేవని ప్రస్తుతం గ్రామాల్లో తమ ముంగిటే ఉండడం వలన వేగంగా వారి వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. జగనన్న కాలనీల్లో గృహాల ఏర్పాటు.. వాటిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారం చెరువులు క్లోరినేషన్, బ్లీచింగ్ తదితర కార్యక్రమాలు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

కిలో పొగాకు ధర రూ. 242

ఒంగోలు రూరల్: రూరల్‌లోని పొగాకు వేలం కేంద్రం–2లో గురువారం కిలో పొగాకు ధర రూ.242 గా నమోదైంది. మొత్తం బేళ్ళు 625 రాగా 603 బేళ్ళు వివిధ కంపెనీల ప్రతినిధులు కొనుగోళ్ళు చేశారు. 2 బేళ్ళు నోబిడ్ అయ్యాయి. గరిష్ట ధర రూ.242 పలుకగా, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర రూ.227.41 గా నమోదయినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

రెండో ఏడాదే అద్భుత ఫలితాలు

- 85 మందిలో 38 మందికి సీట్లు వచ్చే అవకాశం
- జీఎస్ఆర్ నీట్ అకాడమీ డైరెక్టర్ జీఎస్ఆర్


సీట్లు సాధించేందుకు అవకాశం ఉన్న విద్యార్థులతో జీఎస్ఆర్

ఒంగోలు: విద్యా సంస్థ ప్రారంభించిన ద్వితీయ సంవత్సరంలోనే 85 మంది విద్యార్థులకు 38 మెడికల్, ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాలలో సీట్లు సాధించేందుకు అవకాశం ఉందని జీఎస్ఆర్ అకాడమీ డైరెక్టర్ జి.నాగేశ్వరరావు (జీఎస్ఆర్) తెలిపారు. గురువారం స్థానిక మంగమూరు రోడ్డులోని జీఎస్ఆర్ అకాడమీలో నీట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 40 మంది విద్యార్థులలో 15 మందికి మెడికల్ సీట్లు, ముగ్గురికి వెటర్నరీ, అగ్రికల్చర్ సీట్లు లభించాయన్నారు. తాజాగా 85 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, వారిలో 38 మందికి అవకాశం ఉందన్నారు. అధ్యాపకులు సురేష్, హరిబాబు, బి.శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, నరశింహారావు, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఆంజనేయా..పాహిమాం

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు దక్షిణంపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామస్తులు గురువారం వేదపండితులు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి భారీ విగ్రహానికి గ్రామానికి చెందిన పలువురు భక్తులు గజమాల, తులసీదళాల మాల, వడ మాల సమర్పించారు. బుధవారం రాత్రి సీతారాముల శాంతి కల్యాణం కనులపండువగా నిర్వహించారు.

బాబా భక్తుల భిక్షాటన

మార్కాపురం: గురు పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో సాయిబాబా ఆలయంలో మహిళ భక్తులు గురువారం నుంచి సాయి భిక్షాటన కార్యక్రమం ప్రారంభించారు. మందిర కార్యదర్శి హరిహరరావు మాట్లాడుతూ నెల రోజులపాటు గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు పట్టణం, గ్రామాల్లో భిక్షాటన సాగుతుందని, జూలై 1, 2 తేదీల్లో మందిరంలో సామూహిక విష్ణు, లలితా సహస్ర నామార్చన నిర్వహిస్తామని, 3న గురు పౌర్ణమి రోజున 25 వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

సచివాలయానికి వాటర్ కూలింగ్ మిషన్

పొదిలి రూరల్: మండలంలోని తలమళ్ల గ్రామ సచివాలయానికి అదే గ్రామానికి చెందిన ముప్పరాజు శ్రీను, నల్లబోలు వెంకటేశ్వర్లు, వీర్ల బసవయ్య కలిసి రూ.15 వేల విలువైన వాటర్ కూలింగ్ మిషన్ అందజేశారు. సచివాలయానికి పనులపై వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా కూలింగ్ మిషన్ అందజేసినట్లు దాతలు పేర్కొన్నారు. దాతలకు సచివాలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

తాళ్లూరు: గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం సందర్శించారు. జిల్లాలో గ్రంథాలయ సెస్‌ల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రంథాలయ భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రంథపాలకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు గురువారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి కళాశాల విద్యలో చేపట్టిన మార్పులకు అనుగుణంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రూప్‌లో సింగిల్ మేజర్ సబ్జెక్ట్, ఒక మైనర్ సబ్జెక్ట్ ఉంటుందన్నారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీలో గణితం, వృక్ష శాస్త్రం, మేజర్ సబ్జెక్టుగా, కంప్యూటర్ సైన్స్, రసాయన శాస్త్రం మైనర్ సబ్జెక్టుగా ఉంటాయి. బీఏలో చరిత్ర మేజర్ సబ్జెక్టు, ఆర్థిక శాస్త్రం మైనర్ సబ్జెక్టుగా ఉంటుందని తెలిపారు.

ప్రశాంత జీవితం యోగాతో సాధ్యం

తాళ్లూరు: యోగా ప్రశాంత జీవితానికి చక్కగా ఉపయోగపడుతుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా విద్యానికేతన్ యోగా పాఠశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా రోజూ చేసిన వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉంటారని, ఎంత శ్రమ చేసినా సరే మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. యోగా శిక్షణ నిపుణుడు శ్రీరామ్ గురూజీ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం శిష్యులు గురూజీని ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శి ఐ.వెంకటరెడ్డి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కొర్రపాటి విష్ణు పాల్గొన్నారు.